## రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476

క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక





EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక 337 | సోమవారం 1 సెప్టెంబర్ 2025 | వెల : 3 రూ/.. | పేజీలు - 8




## భారత్-చైనా సంబంధాలు
# బలోపేతం

**అభివృద్ధిలో భాగస్వామ్యమే.. ప్రత్యర్థులు కావు**

**ట్రంప్ సుంకాలతో ఇరుదేశాలు వాణిజ్యపరంగా దగ్గర**

**ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడుజిన్‌పింగ్ స్పష్టీకరణ**

**షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం**

**సరిహద్దు సమస్యకు న్యాయమైన పరిష్కారానికి కృషి**

**న్యూఢిల్లీ, ఆగస్టు31:**
భారత్– చైనా సరిహద్దు సమస్యకు న్యాయమైన, సహేతుకమైన, పరస్పర ఆమోద యోగ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిజ్ఞ చేశారు. అంతేకాదు ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. భారత్, చైనాలు రెండూ అభివృద్ధి భాగస్వాములే కానీ, ప్రత్యర్థులు

మిగతా 2లో



# సీబీఐకి కాళేశ్వరం

## ప్రాజెక్టు విచారణపై అసెంబ్లీలో కీలక నిర్ణయం

**కేంద్ర దర్యాప్తు సంస్థకు ప్రాజెక్టు విచారణపై అసెంబ్లీలో నిర్ణయం**

**అవకతవకలను గుర్తించిన జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక**

**ప్లానింగ్ లేకుండానే మూడు బ్యారేజీల నిర్మాణం**

**ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ లోపాలుగా గుర్తించిన ఎన్‌డీఎస్‌ఏ**

**కేంద్ర ప్రభుత్వ సంస్థలైన వ్యాప్కోస్ భాగస్వామ్యం**

**అందుకే సీబీఐకి అప్పగించాలన్న సీఎం రేవంత్ రెడ్డి**

**పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం – జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికపై శాసనసభలో సుదీర్ఘంగా చర్చించిన మీదట తదుపరి విచారణకు ఈ మొత్తం వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, అవినీతి ఆరోపణలపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను నియమించడం జరిగింది. దీనిపై విచారణ కమిషన్ తన నివేదికను జూలై 31, 2025 వ తేదీన ప్రభుత్వానికి సమర్పించింది. ఆగస్టు 4, 2025 వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశం ఆ నివేదికను ఆమోదించింది. తదుపరి చర్చ కోసం నివేదికను శాసనసభ ముందు ఉంచాలని నిర్ణయించింది. ఆ మేరకు ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. జస్టిస్ ఘోష్ కమిషన్ తన నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి అంశాలను ప్రస్తావించింది. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని, అసలు ప్లానింగ్ లేదని కమిషన్ తేల్చిచెప్పింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ నిర్మాణ వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్ లోపాలు కారణమని తేలింది. నాణ్యతా నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నిర్మాణంలో లోపాలు ఏర్పడ్డాయని ఎన్డీఎస్ఏ గుర్తించింది. ఈ అంశాలన్నింటిపై లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని ఎన్డీఎస్ఏ, విచారణ కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. ప్రాజెక్టులో అంతర్ రాష్ట్ర అంశాలు, కేంద్ర రాష్ట్రాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు

మిగతా 2లో



# నిబంధనలకు విరుద్ధంగా విచారణ

**జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ తమ హక్కులను కాలరాసిందన్న హరీశ్‌రావు**

**హైదరాబాద్, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
తమ హక్కులను జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కమిటీ కాలరాసిందని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం రిపోర్ట్‌పై విచారణ సందర్భంగా ఆయన హరీశ్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పీసీ ఘోష్ ఎఫెక్ట్ పీపుల్ అయిన మా హక్కులను కాలరాశారు. మాకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదు. మాపై చేయబోతున్న ఆరోపణల గురించి ఆ వివరాలు చెప్పి.. దానిపై మా వివరణ తీసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. దాన్ని ఆయన అనుసరించలేదు. నాకుగానీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గానీ, ఇంకా పిలిచిన నేతలు, అధికారులకు కూడా నాకు తెలిసిన వరకు 8బీ కింద నోటీసులు ఇవ్వలేదు. క్రాస్ ఎగ్జామినేషన్‌కు అవకాశం ఇవ్వలేదు. ఈ విచారణ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది సుస్పష్టం. ఇవాళ కాంగ్రెస్

మిగతా 2లో

# వీడిన మిస్టరీ

**చెన్నూరు ఎస్‌బీఐ కుంభకోణం కేసును ఛేదించిన పోలీసులు..**

**క్యాషియర్ నరిగె రవీందర్ సహా 44 మంది అరెస్టు**

**8మంది బ్యాంకు సిబ్బంది కీలకపాత్ర**



**15.237 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.23 లక్షల నగదు స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**

**రామగుండం, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచిలో జరిగిన కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు క్యాషియర్ నరిగె రవీందర్ తో సహా 44 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీడియా ఎదుట ముగ్గురు ప్రధాన నిందితులను ప్రవేశ పెట్టారు. క్యాషియర్‌తో పాటు స్కాంలో బ్యాంక్ మేనేజర్, 8మంది బ్యాంకు మంది సిబ్బంది కీలక పాత్ర పోషించారు. నిందితులను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మిగతా 2లో



## బీసీలకు
# లైన్ క్లియర్

**స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం**

**మున్సిపల్, పంచాయతీరాజ్ బిల్లుకు చట్టసవరణ**

**శాసనసభలో బిల్లులను ప్రవేశ పెట్టిన మంత్రి సీతక్క**

**రాబోయే ఎన్నికల్లో 42శాతం కోటా అమలుకు సీఎం హామీ**

**హైదరాబాద్, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. మంత్రి సీతక్క ముందుగా మున్సిపల్, తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. అనంతరం వాటి గురించి చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడిచింది. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ప్రభుత్వం ఈ రెండు బిల్లులను సభ ముందుకు తెచ్చింది. స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి, బీసీలకు 42 శాతం కోటా కల్పించడమే ఈ బిల్లుల ముఖ్య ఉద్దేశం. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..

మిగతా 2లో

## డిక్లరేషన్ కాదు..
# డెడికేషన్ కావాలి

**బీసీ రిజర్వేషన్లు, పంచాయతీ సవరణ బిల్లుపై కేటీఆర్**



**హైదరాబాద్, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
బీసీ వర్గాల పట్ల డిక్లరేషన్ ఒక్కటే సరిపోదు డెడికేషన్ కూడా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చురకలంటించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ శాసనసభలో ప్రసంగించారు. డిక్లరేషన్ ఒక్కటే సరిపోదు డెడికేషన్ కూడా ఉండాలి. అప్పుడే ప్రజలు

మిగతా 2లో



# 'ఎడ్యుకేట్ గర్ల్స్'కు 'రామన్ మెగసెసె' అవార్డు

**2025 ఏడాదికి ఎంపికైన భారతీయ ఎన్జీవో**

2

## సెప్టెంబర్ లోనూ
# భారీ వర్షాలు

**సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు**

**అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన**



**హైదరాబాద్, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):**
సెప్టెంబర్ నెలలో కూడా దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆదివారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక ప్రకటన చేసింది. ఐఎండీ అంచనాల ప్రకారం, సెప్టెంబర్

మిగతా 2లో

తరువాయి పేజీ..



## భారత్-చైనా సంబంధాలు
# బలోపేతం

కాదని మోదీ, జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల మధ్య ఉన్న వైరుధ్యాలు, వివాదాలుగా మారకూడదని పేర్కొన్నారు. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ప్రారంభించిన నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అల్లకల్లోలం ఏర్పడింది. ట్రంప్ ముఖ్యంగా భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకున్నారు. దీనితో భారత్, చైనాలు వాణిజ్యపరంగా దగ్గర అవుతున్నాయి. అందుకే ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరీకరించడంలో ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థల పాత్రను మోదీ, జిన్‌పింగ్ గుర్తించారు. రెండు దేశాల సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో కొనసాగించాల్సిన అవసరముందని జిన్‌పింగ్ అన్నారు. ద్వైపాక్షిక సంబంధాల స్థిరమైన, దృఢమైన స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి కృషి చేయాలన్నారు. ట్రంప్ ఏకపక్ష విధానాలను విమర్శించిన జిన్‌పింగ్, బహుళ ధ్రువ ప్రపంచంతోపాటు ఆసియా సహా ప్రపంచవ్యాప్తంగా శాంతి శ్రేయస్సుల కోసం తమ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారత్– చైనా అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యం కోసం పనిచేయాలన్నారు. అందుకు ఆసియాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా శాంతి శ్రేయస్సుకు తమ వంతు కృషి చేయడానికి చారిత్రక బాధ్యతను పెంచుకోవాలని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య మెరుగుపడుతున్న సంబంధాలు 2020లో గల్వాన్ లోయలో సరిహద్దు వివాదంతో ఇరుదేశాల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలహీనపడ్డాయి. ఈ నేపథ్యంలో తెగిపోయిన సంబంధాలు మళ్లీ బలపడుతున్న వేళ సుమారు ఏడేళ్ల తర్వాత మోదీ–జిన్‌పింగ్ ద్వైపాక్షిక సమావేశం జరిగింది. అయితే ఓ వైపు ప్రపంచ దేశాలపై సుంకాలతో విరుచుకుపడుతున్న వేళ భారత్– చైనా దేశాధినేతల భేటీ ప్రాముఖ్యతను సంతరించుకుంది.

# సీబీఐకి కాళేశ్వరం

పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, ఫైనాన్సింగ్‌లో, వ్యాప్కోస్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నందున ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సీబీఐకి అప్పగించడం సముచితం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ శాసనసభ నిర్ణయం తీసుకుంటున్నది. ఎన్నో రకాలైన అంశాలు, విచారణ అర్హమైన విషయాలు ఇందులో ఉండటం వల్ల సీబీఐ విచారణకు ఆదేశించాలని నిర్ణయించడం జరిగింది. నిజాయితీతో కూడిన విచారణ జరగాలని కోరుకుంటున్నాం.. అని కమిషన్ నివేదికపై చర్చకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు వివరించారు. అంతకుముందు జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిషన్ నివేదికను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభ ముందుంచారు. అనంతరం స్పీకర్ గారి అనుమతి మేరకు మంత్రి స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టు స్థలాన్ని మార్చడం నుంచి మేడిగడ్డ స్పియర్స్ కుంగిపోయిన పరిణామాల వరకు, తదనంతరం జస్టిస్ ఘోష్ గారి నేతృత్వంలో విచారణ కమిషన్ నియామకం వరకు వివరాలను సభలో తెలియజేశారు. చర్చపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ, ఘోష్ కమిషన్ ఏర్పాటు నేపథ్యం, కమిషన్ సమర్పించిన 665 పేజీల నివేదికలోని సారాంశాన్ని, జరిగిన చర్చ వివరాలను ప్రస్తావించారు. నివేదికల్లో అనేక అంశాలతో మల్టిపుల్ కాంప్లికేషన్స్ తో ముడిపడి ఉన్నందున ఎలాంటి శషభిషలకు తావులేకుండా ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలనుకున్న ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్టు తెలిపారు.


## నిబంధనలకు విరుద్ధంగా విచారణ

పార్టీ అసలు మేడిగడ్డ వద్ద లోపం ఏర్పడక ముందే కాళేశ్వరంపై దుష్ప్రచారాన్ని ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రారంభించారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా మేం సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ముందే మేనిఫెస్టోలో పెట్టింది. కాంగ్రెస్ ముందు నుంచి కూడా ఈ ప్రాజెక్టు కడితే కేసీఆర్, బీఆర్ఎస్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నరు. భూ సేకరణను అడ్డుకున్నారు. అనేక ఆరోపణలు చేస్తూ వచ్చారు. దాంట్లో భాగంగానే ఈ ఘోష్ కమిషన్ వేసి రాజకీయమైన కక్ష సాధింపునకు ఈ ప్రభుత్వం దిగుతుంది. నేను చెప్పేది ఒకటే విషయం. ఆ వాస్తవాలు చట్టానికి లోబడి ఉండాలి. ఘోష్ కమిషన్ రిపోర్ట్‌లో ఎక్కడా లేదు. ఇది రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుంది' అన్నారు. ఆదివారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 660 పేజీల నివేదికపై చర్చించేందుకు కేవలం అరగంట సమయం ఇవ్వడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఇంత పెద్ద నివేదికపై అరగంటలో ఏం మాట్లాడగలం? ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేసే కుట్ర ఇది" అని ఆయన అన్నారు. ఇంత కీలకమైన అంశంపై మాట్లాడేందుకు కనీసం రెండు గంటల సమయం ఇవ్వాలని, ఎలాంటి అంతరాయం కలిగించవద్దని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే రాబోయే రెండు రోజులు కూడా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## సెప్టెంబర్ లోనూ
# భారీ వర్షాలు

నెలలో వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ) కంటే 109 శాతానికి పైగా నమోదవుతుందని పేర్కొంది. 1971 నుంచి 2020 వరకు ఉన్న డేటా ఆధారంగా, సెప్టెంబర్ నెల దీర్ఘకాలిక సగటు వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉంది. ఈసారి దీనికంటే ఎక్కువ వర్షపాతం కురవనుందని ఐఎండీ తెలిపింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం నుంచి అధిక వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా ఈశాన్య, తూర్పు భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, దక్షిణ ద్వీపకల్పంలోని చాలా భాగాలు, ఉత్తర భారతదేశంలోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని నివేదికలో వివరించింది. నష్టాలను నివారించడానికి మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలని, వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలను ఉపయోగించుకోవాలని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించింది. సెప్టెంబర్ నెలలో పశ్చిమ–మధ్య, వాయువ్య, దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని ఐఎండీ అంచనా వేసింది.

## హై టెన్షన్ వైర్ల కింద
# బట్టల షాపు?




**ప్రారంభానికి సిద్ధంగా తిరుపూర్ కాటన్ బజార్**
**అనుమతుల్లేకుండా అక్రమంగా షెడ్డు నిర్మాణం**
**తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం**
**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యం**
**ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు**

పీర్జాదిగూడ ఆగస్టు 31 (క్విక్ టుడే న్యూస్):
గ్రేటర్ పరిధిలో ఇప్పటికే పలు షాపింగ్ మాల్ లలో ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. పలు దుకాణాల్లో జరిగిన ప్రమాదాల కారణంగా ప్రాణనష్టం కూడా సంభవించిన ఘటనలు చూస్తూనే ఉన్నాం. అయితే ఇవేమీ పట్టనట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉప్పల్ డిపోకు అతి సమీపంలో ప్రధాన రహదారిపై బోడుప్పల్ కమాన్‌కు పక్కన ఉన్న హైటెన్షన్ వైర్ల కింద ఓ బట్టల దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధమైంది. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్డును నిర్మించి తిరుపూర్ కాటన్ బజార్‌ను ప్రారంభించేందుకు నిర్వాహకులు దాదాపు ముహూర్తం కూడా ఖరారు చేశారు. అయితే అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం దారుణం. ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా వ్యాపారం చేసుకుంటుంటే అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప.. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అడ్డుకునే ప్రయత్నం చేయడంలేదు. హైటెన్షన్ వైర్ల కింద కూడా అక్రమ వ్యాపారాలు చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందే దీనిని నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల్లేని వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో మాత్రం కమిషనర్ విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇష్టారాజ్యంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలు తుంగలో తొక్కిన తిరుపూర్ కాటన్ బజార్ నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు కూడా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా దీనిని తొలగించేందుకు సిద్ధం కావాలని వారు కోరుతున్నారు.

## హామీలు మరిచిన ప్రభుత్వం..
# అసహనంలో ఉద్యోగ వర్గం

### తపస్ జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి

సిద్దిపేట, ఆగస్టు31 (క్విక్ టుడే న్యూస్):
ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఇచ్చిన హామీలన్నిటిని మరిచిపోయి ఉద్యోగులకు మొండి చేయి చూపెట్టిందని, ఇచ్చిన హామీలతో అధికారం పొందిన తర్వాత వాటిని అమలుపరచక ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేస్తుందని జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అన్నారు. స్థానిక శిశు మందిర్ లో ఏర్పాటు చేసిన జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన రఘువర్ధన్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శులు పింగోజు జనార్ధన్, పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల మురళీధర్ లతో కలిసి సెప్టెంబర్ 1న నిర్వహించే మన పాఠశాల మన ఆత్మగౌరవం మరియు ఆత్మగౌరవ సభలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం రఘు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పటి వరకు దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. కోర్టు 2003 డీఎస్సీ వాళ్లకు ఓ పి ఎస్ అమలు చేయమని చెప్పినప్పటికీ ఏమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వం చేసిన హామీలను గుర్తు చేయడం కోసం సెప్టెంబర్ 1న విద్రోహ దినం గా జరుపుకుంటున్నామని అన్నారు. సెప్టెంబర్ 1న 2 కార్యక్రమాలను తపస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని మన పాఠశాల – మన ఆత్మగౌరవం మరియు ఆత్మగౌరవ సభ లను నిర్వహిస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ 1న ఉదయం పాఠశాలలు ఉత్తమ విద్యా కేంద్రాలుగా మారడానికి కావలసిన చర్యలను తీసుకోవడం కోసం గాను, ఉపాధ్యాయులలో అంకిత భావాన్ని పెంపొందించడానికి మన పాఠశాల మన ఆత్మగౌరవం అనే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, అదే రోజు మధ్యాహ్నం హైదరాబాద్ లో జరిగే సిపిఎస్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయడం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఈ రెండు కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా తపస్ విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు స్వామి గౌడ్, లింగమూర్తి, ప్రవీణ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లేశం వివిధ మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.




# బీసీలకు లైన్ క్లియర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పంచాయతీరాజ్ చట్టం–2018, మున్సిపాలిటీల చట్టం–2019 వల్లే రిజర్వేషన్లు 50 శాతానికి మించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీల సాధికారతకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వానికి నిజాయతీ లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం మార్చిలో ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందడానికి ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ నిలదీశారు. తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం నిరంతరం కృషి చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కులగణన సర్వే నిర్వహించామని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగానే మార్చిలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపామని, అవి గత ఐదు నెలలుగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈలోగా ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తే, ప్రతిపక్షం గవర్నర్‌ను ప్రభావితం చేసి అడ్డుకుందని ఆరోపించారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోసం ఐదుసార్లు లేఖలు రాసినా స్పందన లేదన్నారు.

## డిక్లరేషన్ కాదు.. డెడికేషన్ కావాలి

హర్షిస్తారు. మీరు హౌస్ హోల్డ్ సర్వే చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొనలేదని అంటున్నారు. ముగ్గురం ఎన్నికల అఫిడవిట్లు ఇచ్చాం.. నేను ఓసీనా, బీసీనా అనేది మీ అందరికీ తెలుసు. నేను పాల్గొంటే ఏంటి..? పాల్గొనకపోతే ఏంటి..? తప్పు చేసింది మీరు అని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం చేసినప్పుడు 52 శాతం బలహీన వర్గాలు ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం బీసీల సంఖ్య 6 శాతం తగ్గింది. దీనిపై ఎందుకు రివ్యూ చేయలేదు. ముగ్గురు పాల్గొనకపోతే 6 శాతం తగ్గుతదా..? మేం పాల్గొనంతా మాత్రాన 6 శాతం తగ్గదు. బలహీన వర్గాలకు చిత్తశుద్ధితో రిజర్వేషన్లు అమలు చేయాలి. రాహుల్ ప్రధాని అయితేనే చేస్తామని చెప్పి ఉండేది. బీసీ సబ్ ప్లాన్ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. పదవులతో రాజకీయంగా న్యాయం జరగదు. సామాజికంగా, ఆర్థికంగా కూడా న్యాయం జరగాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# 'ఎడ్యుకేట్ గర్ల్స్'కు 'రామన్ మెగసెసె' అవార్డు

### 2025 ఏడాదికి ఎంపికైన భారతీయ ఎన్జీవో

న్యూఢిల్లీ, ఆగస్టు31:
బడి బయట ఉన్న బాలికలకు విద్యను అందస్తున్న భారతీయ ఎన్జీవో 'ఎడ్యుకేట్ గర్ల్స్'కు ఆసియా నోబెల్ 'రామన్ మెగసెసె' అవార్డు వరించింది. 2025 ఏడాదికిగాను అవార్డు గ్రహీతల పేర్లను ఫౌండేషన్ (ఆర్ఎంఏఎఫ్) ఆదివారం ప్రకటించింది. రామన్ మెగసెసె పురస్కారానికి ఎంపికైన తొలి భారతీయ ఎన్జీవోగా ఈ సంస్థగా ఎడ్యుకేట్ గర్ల్స్ నిలిచింది. నవంబర్ 7న మనీలాలో 67వ రామన్ మెగసెసె అవార్డుల బహూకరణ ఉంటుందని ఆర్ఎంఏఎఫ్ తెలిపింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనానమిక్స్ గ్రాడ్యుయేట్ సఫీనా హుస్సేన్, మహిళల్లో నిరక్షరాస్యతను రూపుమాపడానికి, 2007లో 'ఎడ్యుకేట్ గర్ల్స్'ను స్థాపించారు.

# వీడిన మిస్టరీ

మీడియా ఎదుట హాజరుపరిచారు. రామగుండంలోని సీపీ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సీపీ వెల్లడించారు. ఆగస్టు 23న ఎస్బీఐ చెన్నూర్ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా చెన్నూర్‌లో పీఎస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని చెప్పారు. బ్యాంకులో 402 గోల్డ్ లోన్ ఖాతాలో 25.17 కిలోల బంగారాన్ని నిలువ ఉంచిందని, వీటి విలువ రూ.12.61 కోట్లు, నగదు రూ.1.10 కోట్లు దుర్వినియోగం చేసి దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. అక్టోబర్ 2024కు ముందే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్న క్యాషియర్ తన నష్టాన్ని పూడ్చుకునేందుకు, మరింత బెట్టింగ్ కొనసాగించేందుకు బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి మోసానికి పాల్పడ్డాడని తెలిపారు. బ్యాంక్ కరెన్సీ, ఛెస్ట్ తాళం మేనేజర్, క్యాషియర్ సంయుక్త ఆధీనంలో ఉండాలని నిబంధనలు ఉండగా మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్ తన తాళాన్ని క్యాషియర్‌కు ఇచ్చాడని దాన్ని ఉపయోగించుకుని, నరిగె రవీందర్, క్యాషియర్, మేనేజర్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సహకారంతో బంగారం, నగదు దొంగిలించేందుకు పథకం రచించాడని అన్నారు. అక్టోబర్ 2024 నుంచి తరచూ గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి, తన స్నేహితులకు అప్పగించి ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలలో తాకట్టు పెట్టి, డబ్బును తమ ఖాతాల్లో జమ చేసి, కొంత కమిషన్ తీసుకుని మిగతా మొత్తాన్ని క్యాషియర్ రవీందర్‌కు బదిలీ చేసేవారని వివరించారు.